గండం

మరో గండం గడిచింది—పిండం బయటపడింది.

సుందరి పాలిపోయిన మొహంతో కళ్ళుమూసుకుని వెల్లకిలా పడుకుంది. ఇప్పు డామె మనస్సులో ఇందాక చెల రేగిన తుఫాను జాడలేవి లేవు. మొదటి కాన్పుకు పోని ప్రాణ భయం తన కీసారి ఎందుకు కలిగినట్టు? తన బిడ్డ మొగపిల్ల వాడని తనకు ముందే తెలుసు—తనుపోతే ఏమవుతాడో అని ఎందుకంత ఖంగారు పడ్డది? తన చెల్లెలు, కమల వాణ్ణి సవతి బిడ్డణ్ణి చూసినట్టు చూస్తోంది!...

అన్నట్టు, పాపం, కమలగతి ఏమయిందని, కొంపతీసి దానిక్కూడా ఇవాళే—

అవతల తన పెద్దన్నగారి భాగంలో కమల పురుడు పోసుకోవటానికి సిద్ధంగా ఉంది. తొలిచూలు. తను మలు చూలని తనకన్న కమలనే అందరూ బాగా చూశారు. తన్నడిగితే తొలిచూలుకన్న మలుచూలే కష్టం. మొదటి సారి జరగబొయ్యేది తెలీదు.

ఎట్లాగయినా కమలమీదనే అందరికీ ప్రేమ జాస్తి కావటానికి తనే అందగత్తె, తన మొగుడుకే ఎక్కువ ఆస్తి

ఉంది. కాని అందరికీ కమలమీదనే ఆపేక్ష. దాన్ని మొగుడు కూడా నెత్తిన పెట్టుకొని ఊరేగుతాడు. తనను అందరూ తక్కువగా చూసి, మళ్ళీ తను వికారంగా ఉంటుందని తన మీదపడి ఏడుస్తారు.

తను నిజంగా మంచిదని ఎవరికీ తెలీదు—కమలకు తప్ప కమల ఒక్కతే తన్ను బాగా చూస్తుంది. తనకన్న మంచిది అదొక్కతే !

ఈ కూంక అయినా తన పోలిక అయితే బాగుండును. పెద్దవాడు అంతా అచ్చుగుద్దినట్టు తన మామగారి పోలికే.

ఈ పదిరోజులూ ఎట్లా వెళతయ్యో! తన్ను ముసలమ్మలు ఏంపీక్కుతింటారో, నూతిలో చాదవేసే దెప్పుళ్ళో!

సుందరి ఆలోచనలు అంతకంతకూ అస్పష్టం కాసాగినై ఆమెకు కాస్త మగతగా ఉంది.

*　　　*　　　*

"దానికీకూడా మగపిల్లవాడే!... ఒక్క గంట తేడా కూడా లేదే ! ఇదేంపాపఖర్మమో! ఇట్లా జరగ్గూడదరా! ఒక్క ఇంట్లోనే ఒక్కరోజునే రెండు కానుపులా? ఎవరో ఒకరికి గండం తప్పదు!"

ఈ మాటలన్నీ సుందరి చెవుల పడుతున్నై. కాని మనస్సులో నాటుకోవటంలేదు కొంచెం సేపయిన తర్వాత మీద కళ్ళు తెరిసి చుట్టూ చూసింది.

అమ్మమ్మ చరచరా లోపలికొచ్చి సుందరికేసి చేతులూపుతూ, "ఆ కమలకూడా ఇప్పుడే ప్రసవించింది. ఉపహారించండి" అని వెళ్ళిపోబోయింది.

"మగబిడ్డేనా?" అన్నది సుందరి బలహీనంగా.

"ఆ!" అన్నది ముసలమ్మ, ఆడబిడ్డ అయినా ఇబ్బందిలేకపోయేదన్నట్టు.

"ఎవరో ఓరి గ్గండంతప్పదు! ఎవరో ఓరి గ్గండం తప్పదు!"

అప్రయత్నంగా సుందరి తన బిడ్డణ్ణి పొదువుకున్నది. తన బిడ్డకే అపాయమూ రాదు! రాకూడదు!... పాపం, కమలకీ విషయంలోనూ తన అదృష్టం లేదు. దాని బిడ్డ ఏమవుతాడో! ఒవేళ వాడికేమన్నా అయితే తనకు చాలా కష్టంగా ఉంటుంది—చాలా? —ఆఁ, అయినా ఆ ముసలమ్మ కబుర్లు నిజమూ ఏమిటి?"

ఇద్దరు బిడ్డలకూ ఆరురోజులు దాటిన తరువాత పెద్ద వాళ్ళ విచారం వెనుకపడింది. గండం గురించి మాట్లాడటం మానేశారు. అప్పచెల్లెళ్ళిద్దరూ నూతిలో చేదవెయ్యటం మహావైభవంగా జరిగింది.

అందరూ తనపిల్లవాడికంటె కమలబిడ్డే కనుముక్కు తీరుగలవాడౌతాడనుకోవటం సుందరి విన్నది. కాని అక్క అసూయపడలేదు. అసూయపడేటందు కవకాశం లేక పోయింది కమలబిడ్డే బాగున్నాడని ఎవరో అనగనే "ఎంత కనిబిడ్డ కాదేమ" అనేసామొత సుందరికి చప్పున స్ఫురించి మనస్సు చివుక్కుమన్నది. తన కటువంటి ఆలోచన రావటం చాలా తప్పు.

కాని కమలబిడ్డే అందంగా ఉంటాడనే విషయం సుందరి రూఢిచేసుకున్నది. అందులో ఆ మాట అంటే తనకు అందులో అబద్ధం ఏమీ కనిపించలేదు.

అప్రయత్నంగా సుందరి తన బిడ్డలో అనాకారితనం చూడటం ప్రారంభించింది.

"ఏడిముక్కు చట్టిముక్కల్లే ఉందేమే, కమలా? వాడు నవ్వితే మూతి చూడు, పక్కకెట్లా పోతుందో !"

కమల దొంగకోపంతో, "బాగానేఉంది లేవే, పసి వెధవకట్లా వంకలు పెడతావేం? చిన్నపిల్లలంతా అట్లాగే ఉంటారు!" అన్నది.

కమల తనబిడ్డను ముద్దులాడినా, వెనకేసుకొచ్చినా సుందరి హృదయంలో ఏదో గుచ్చుతున్నట్లయేది. అది అసూయమాత్రం కాదు. కమల ఇద్దరుపిల్లల్లోనూ తేడా చూడనట్లు ప్రవర్తించేది. అది నటన ఎటా అవుతుంది? కమలవంటి అమాయకురాలు నటించగలదా! నటించటం తనకు చాతకాలేదు. కమల కొడుకుమీద తనకాపేక్ష లేదు. వాణ్ణిచూస్తే తనకు భయం —ఏమిటో అర్థంగాని భయం! వాణ్ణి చేతులోకి తీసుకుంటే జారవిడుస్తానని భయం! వాడికి తను నీళ్ళుపోసేటప్పుడు దెబ్బ గట్టిగానూ, తగలరానిచోట తగులుతుందని భయం!... వాడేక్షణాన గుటుక్కు మంటాడో ! (చిన్నపిల్లల కెంతసేపు కావాలి!) ఆక్షణాన వాడు తనచేతుల్లోమాత్రం ఉండకూడదు! వాడిప్రాణం దొడ్లో

పోతే తను ఇంట్లో ఉండాలి. ఇంట్లో పోతే దొడ్లో ఉండాలి ! ఇదే సుందరి కోరింది!

కమల చేతుల్లో తనబిడ్డ ప్రాణంపోతుందని సుందరి కేమాత్రమూ భయంలేదు. తన బిడ్డకు నీళ్ళుపోస్తూ ముంగాళ్ళ మీద బోర్లా పడుకోబెట్టుకుని చేతుల్లో వేన్నీళ్ళు పోసికొని వాడితలమీద కమల ఎంతగట్టిగా బాదినా తనకు భయం వేసేదికాదు. కమల తన బిడ్డ దగ్గర ఉన్నంతకాలమూ వాడికి యమభయం లేదని సుందరికి గట్టిధైర్యం. అది సుందరబిడ్డ మీద ఈగ వాలనీదు తన బిడ్డ ఏడిచినా నిర్లక్ష్యంగా ఉంటుంది గాని తన అక్క కొడుకు కాస్త కిచుమంటే అడావుడి పడుతుంది. వాడంటే దానికంతప్రాణం !

* * *

ఇద్దరు బిడ్డలకూ ఆరోనెల జరుగుతున్నది. దీపావళికి అక్కచెల్లెళ్ళిద్దరూ పుట్టింటికి వచ్చారు.

తెల్లవారితే నరక చతుర్దశి అనగా సుందరి బిడ్డకు పెద్దపెట్టున జ్వరం వచ్చింది. దానివెంట దగ్గూ పడిశమూను. బిడ్డ నిమిషనిమిషానికి ఉక్కిరిబిక్కిరిఅవుతున్నాడు. సుందరికి గుండెల్లో రాయిపడింది. బిడ్డ బతకడని అధైర్యం పట్టుకుంది. మతిపోయింది.

కమలవచ్చి బిడ్డదగ్గిర కూర్చున్నది. వాళ్ళ చిన్నన్నగారు ఆ అపరాత్రివేళ వెళ్ళి వైద్యుడి దగ్గిర నాలుగు పంచదారమాత్రలు తెచ్చాడు. కమల తన చేతిమీందిగా వాటిని తన చనుబాలలో రంగరించి బిడ్డనోట్లో పోసింది. తరవాతి

రెండుగంటలకల్లా బిడ్డ దగ్గటమూ, ఉక్కిరిబిక్కిరి కావటమూ తగ్గి నిద్రపోయినాడు. అంతసేపూ కమలబిడ్డ దగ్గరే కూర్చుని వాడివూాడుకు తెనచెయ్యి ఆనించి వాడికేసిచూస్తూ కూర్చున్నది.

“కమల నాబిడ్డను బతికించమని దేముణ్ణి వేడుకుంటున్నది” అనుకున్నది, సుందరి ఎందుకో?

మర్నాడుదయమే తలంట్లు. కమల అన్నగార్లిద్దరికీ తలంటింది వాళ్ళ పిల్లలకూడా అంటబోతూ, “అక్కా పిల్లలిద్దరికీ కాస్త ఉగ్గు వెయ్యవే!” అన్నది.

కమలబిడ్డకు ఉగ్గువేసేటప్పుడు సుందరి చేతులువణికినై. కంగారుతో గిన్నెలోదంతా వాడినోట్లో పోసింది. పిల్లవాడు గుడ్లు తేలవేసి ఉక్కిరిబిక్కిరైనాడు.

“అయ్యో, అయ్యో! కమలా!” అన్నది సుందరి.

పక్కనే పిల్లలకు నలుగుపెడుతున్న కమల తిరిగైనా చూడకుండా, “ఏం, ఫర్వాలేదులే!” అన్నది. ఝళ్ళు సుందరి హృదయములో ఏదో గుచ్చుకున్నట్టయింది.

*　　*　　*

నీళ్ళుపోసి సిల్కుచొక్కా—వాళ్ళనాన్న కొన్నది—తొడిగి ఉయ్యాల్లో పడుకోబెడితే కమలకొడుకు రాజా అల్లే, పండుకాయవల్లే ఉన్నాడు. చిన్న మేనమామ చేతికామెరా తెచ్చి బిడ్డలిద్దరినీ ఫొటోతీస్తే అందులోకమలకొడుకే దేదీప్యమానంగా ఉన్నాడు.

సుందరి అసూయపడలేదు—

బతకనిబిడ్డ బారెడు !

"నేనెంత పాపిష్టిదాన్ని ! నాకేం పుండు పుట్టింది!" అని సుందరి తన్ను తానుతిట్టుకున్నది. కానీ ఆ దిక్కుమాలిన సామెత మరుపురాదు!

బహుళ విదియ ఆదివారంనాడు సాయంకాలం ఆరు గంటలవేళ కమలబిడ్డ వడగొట్టిపోయినాడు, ఆ గుంటూరు ఎండలు! ఆ కిందటిరోజే బిడ్డకు వడదెబ్బ తగిలింది. మర్నాడు ఎండ వేళప్పుడు బిడ్డకు శైత్యోపచారాలు చేశారు. బిడ్డ వాటితోనే పోయినాడు.

ఈ వార్త చెవినిపడగానే సుందరిహృదయం మీంది నుంచి మూత తీసేసినట్టయింది. ఆమె హృదయంలోనించి పైకి పొంగివచ్చింది, ఆనందంకాదు దుఃఖం.

సుందరి కమల కొడుకుకోసం పెద్దపెట్టున ఏడువసాగింది. తనకొడుక్కు గండం తప్పిందన్న సంతోషం కలగలేదు. తనకొడుకే్క గండం. ఆమాట తనకు మొదటినుంచీ తెలుసు.ఆసంగతి తెలిసి తను మనస్ఫూర్తిగా వాడి అచ్చటా ముచ్చటా చూడలేకపోయింది. వాణ్ణి ఒక్కసారయినా దగ్గిరికి తీసికోలేదు. ముద్దాడలేదు. అంతఅందమైన బిడ్డను చూసి అంతా మురిస్తే తను చావే చూడగలిగింది.

"నాకెంత అదృష్టం ఉంటేనేం? నేను పాపిష్టిదాన్ని.

ఇక నాకళ్ళతో నిన్ను చూడనుట్రా, తండ్రీ! నా బంగారు నాయనా!" అని సుందరి ఘోష పెట్టి, ఏడుస్తుంటే, ఆమె భర్త, "నీకేమన్నా మతిపోయిందా ఏమిటి? పిల్లలు పోరూ?" అని కోప్పడ్డాడు.

*　　*　　*

అయితే సుందరి ఒక్క పొరపాటుమాత్రం పడ్డది. తను పాపిష్టిదికాదు అదృష్టవంతురాలూ కాదు. తనకన్న కమలే అదృష్టవంతురాలు.